

వైఎస్సార్ సీపీలో చేరికలు

కేశవరం, చెల్లూరు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు.



నేటి నుంచి చతుర్వేద మహాయాగం

ప్రపంచ శాంతి, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఐదు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టే చతుర్వేద మహాయాగం గురువారం ప్రారంభం కానుంది.

8లో

డెల్టాలకు 10,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 10,700 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,050, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

అన్నదాన భవనానికి రూ.10 లక్షల విరాళం



శివరామసుబ్రహ్మణ్యానికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వాడపల్లి శ్రీవేంకటేశ్వర వాసవీ నిత్యాన్నదాన ట్రస్టు తరఫున ఆ ట్రస్టు చైర్మన్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయనకు ఆలయ అర్చకులు తొలుత స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. తర్వాత స్వామివారి చిత్రపటం బహూకరించారు.

జానపదాల్లోని రామకథలు ప్రమాణాలు కావు



సామవేదం షణ్ముఖశర్మ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వేదాల నుంచి జానపద సాహిత్యం వరకూ రామకథ విస్తరించిందని, అయితే జానపదంలో కనిపించే రామకథలన్నీ వాస్తవాలు, ప్రమాణాలు కావని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక హిందూ సమాజంలో ఆయన బుధవారం 22వ రోజు శ్రీరామాయణ ప్రవచనం కొనసాగించారు. 'సీతారామలక్ష్మణుల వనవాస సమయం 14 ఏళ్లూ లక్ష్మణుని భార్య ఊర్మిళ నిద్రపోయిందని, లక్ష్మణుడు అన్ని ఏళ్లూ నిద్రపోలేదని వాల్మీకి మహర్షి చెప్పలేదు. ఇది జానపద సాహిత్యం కల్పన. రాముని వెంట అడవులకు వెళ్లిన సీత ఎంత పతివ్రతో, లక్ష్మణుని వెంట వెళ్లని ఊర్మిళ కూడా అంతే పతివ్రత అని మనం తెలుసుకోవాలి' అని చెప్పారు. ఊర్మిళ అయోధ్యలో వ్రతాలు, నోములు చేసేదని మనం భావించవచ్చని అన్నారు. సీతమ్మను అపహరించుకు వచ్చిన రాక్షస రాజు రావణుడు జనస్థానానికి తన సైన్యాన్ని పంపాడని, అక్కడే నివసిస్తూ రామలక్ష్మణుల కదలికలపై సమాచారం ఇవ్వాల్సిందిగా ఆదేశించాడని చెప్పారు. ధర్మంతో వైరం పెట్టుకుంటే రామునితో వైరం పెట్టుకున్నట్టు అర్థమని అన్నారు. లక్ష్మణ స్వామిని సీతాదేవి పరుషంగా నిందిస్తేనే కానీ ఆయన కదలడని, ఆయన కదిలితేనే కానీ కథ కదలదని ఇదంతా దేవతల ప్రణాళిక అని సామవేదం వివరించారు.

రేపు తాటిపాకలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఈ నెల 5న ఉదయం 10.30 గంటల నుంచి రాజోలు మండలం తాటిపాక బాలాజీ ప్రైవేట్ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వసంతలక్ష్మి తెలిపారు. మరిన్ని వివరాలకు 81218 38392, 79972 53713 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



సభా వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

కాకినాడలో జనసునామీ



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం జగన్

- సీఎం జగన్ సభ సూపర్‌సక్సెస్
- అడుగడుగునా నీరాజనం
- ఆకట్టుకున్న ముఖ్యమంత్రి ప్రసంగం
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్



కాకినాడ సభకు తరలివచ్చిన అశేష జనంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడుగు పెట్టిన వేళ కాకినాడ నగరంలో జనసునామీ ఎగసిపడింది. ప్రతిష్ఠాత్మకమైన వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు పంపిణీ కార్యక్రమానికి సీఎం జగన్ ఇక్కడి నుంచే బుధవారం శ్రీకారం చుట్టారు. నూతన సంవత్సరం ప్రారంభమయ్యాక ఆయన పాల్గొన్న ఈ తొలి కార్యక్రమం.. కనీవినీ ఎరుగని రీతిలో సూపర్ సక్సెస్ కావడం.. ఇటు ప్రజలు, అటు వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పోలీసు పరేడ్ గ్రౌండ్స్ వద్ద హెలికాప్టర్ దిగిన దగ్గర నుంచి తిరుగు ప్రయాణమయ్యేంత వరకూ ప్రజలు.. ప్రధానంగా మహిళలు సీఎం జగన్‌కు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.

నగర వీధులు.. జనప్రవాహాలు

అంచనాలకు మించి వేలాదిగా తరలివచ్చిన మహిళలు, యువకులతో కాకినాడ వీధులు జనప్రవాహాలను తలపించాయి. రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో పండగ వాతావరణమే కనిపించింది. ఎటు చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో లోపల, వెలుపల సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సభా వేదికకు సీఎం జగన్ రావడానికి గంట ముందుగానే ఆ ప్రాంగణం నిండిపోయింది. లోపలకు వెళ్లే అవకాశం లేక పెద్ద సంఖ్యలో ప్రజలు బయటే వేచి ఉండి మరీ తమ ప్రియతమ నేత ప్రసంగాన్ని ఆద్యంతం శ్రద్ధగా ఆలకించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఎస్పీ కార్యాలయం, పెట్రోలు బంకు మీదుగా ఆర్ఎంసీ గ్రౌండ్స్ వరకూ బస్సులో వచ్చిన ముఖ్యమంత్రికి ఆ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన మహిళలు.. పూలజల్లులు కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. పలువురు కళాకారులు సందడి చేశారు. వేదిక పైకి వచ్చీ రావడంతోనే సీఎం, సీఎం అంటూ ఆ ప్రాంగణం మొత్తం మార్మోగిపోయింది.

అవినీతి 'బాబు'లను కడిగేస్తూ..

గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అవినీతిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో వివరిస్తూ చంద్రబాబును కడిగి పారేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను బటన్ నొక్కి లబ్ధిదారులకు చేరవేస్తున్నామన్న సీఎం .. కేజీ బంగారం, ఇంటికో బెంజి కారు ఇస్తామంటూ మోసపూరిత హామీలు ఇచ్చేందుకు వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, అనుకూల మీడియా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 ఏకపక్ష తీరును ఎండగట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సైతం తనదైన శైలిలో విమర్శలు ఎక్కుపెట్టారు. దీనికి మద్దతుగా ప్రజలు కుర్చీల్లో నుంచి పైకి లేచి, రెండు చేతులూ పైకి ఎత్తి నినాదాలు చేశారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందేమో చెప్పాలన్నప్పుడు జనం లేదు లేదంటూ ఉత్సాహంగా చేతులు ఊపడం కనిపించింది.

'నా సోదరుడు కుమార్'

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యాన రూ.20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ (ఫ్రూటీ కుమార్) కళాక్షేత్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన సమయంలో ముఖ్యమంత్రి జగన్ 'నా సోదరుడు కుమార్' అని ప్రస్తావించినప్పుడు.. వేదిక దిగువన ఉన్న జనం ఒక్కసారిగా 'జై కుమార్, జైజై కుమార్' అనే నినాదాలతో ఆయనపై అభిమానాన్ని చాటుకున్నారు. కుమార్ భార్య, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తిని, వారి ఇద్దరు కుమారులను ఎమ్మెల్యే ద్వారంపూడి పరిచయం చేసినప్పుడు.. సీఎం ఆ పిల్లలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. కొండయ్యపాలెం ఫ్లై ఓవర్‌కు తాను గౌరవించే, అభిమానించే నేతల్లో ఒకరైన మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉందంటూ.. అక్కడే ఉన్న ముత్తా తనయుడు నవీన్‌ను జగన్ పలకరించారు.

'జగనన్నా.. మళ్లీ నువ్వే రావాలి'

కాకినాడ పరిసర ప్రాంతాల నుంచి అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఉదయం 7 గంటలకే సభా ప్రాంగణానికి తరలి రావడం కనిపించింది. ఉదయం 11.20 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకున్న సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేయగానే మహిళలు, యువత 'జై జగన్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సభకు వచ్చిన లబ్ధిదారులు, యువత 'జగనన్నా మళ్లీ నువ్వే రావాలి' అంటూ సభా ప్రాంగణం ప్రతిధ్వనించేలా ముక్తకంఠంతో నినదించారు. వేదిక పైకి వచ్చిన దగ్గర నుంచి తిరుగు ప్రయాణమయ్యే వరకూ సీఎం జగన్ చెదరని చిరునవ్వుతో ప్రజలను ఆకట్టుకున్నారు.

ఆపన్నులకు తక్షణ ఉపశమనం

తిరుగు ప్రయాణంలో పలువురు అభాగ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి, తమ కష్టాలు వెళ్లబోసుకున్నారు. వారికి ముఖ్యమంత్రి గంటలోపే ఉపశమనం కలిగేలా కలెక్టర్ కృతికా శుక్లా ద్వారా చర్యలు చేపట్టి, బాధితుల మనసులు చూరగొన్నారు. వేదికపై విద్యా శాఖ ఆధ్వర్యాన వివిధ పాఠశాలల విద్యార్థులు ఆలపించిన పాటలు, చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. తిరుగు ప్రయాణంలో హెలిప్యాడ్ వద్ద ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి తరలి వచ్చిన నాయకులను పేరుపేరునా సీఎం పలకరించి ఫొటోలు దిగడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

చేసిన మంచి చెబుతూ..

కాకినాడలో రూ.109 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం 45 నిమిషాల పాటు ప్రసంగించారు. ఆయన ప్రసంగం సామాన్యులను సైతం ఆకట్టుకుంది. ఆయన ప్రసంగంలో చంద్రబాబు, దత్తపుత్రుడి ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలోనూ జనం పెద్ద ఎత్తున ఈలలు వేస్తూ, కేరింతలు కొట్టడం కనిపించింది. గత చంద్రబాబు పాలన, గడచిన 55 నెలల మీ బిడ్డ జగన్ పాలనకు ఉన్న తేడాను గమనించమని కోరినప్పుడు 'జై జగన్' నినాదాలు మిన్నంటాయి. 'ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఏ గ్రామాన్నయినా తీసుకోండి. అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు కుప్పం వరకూ ఏ గ్రామం తీసుకున్నా ఫర్వాలేదు' అంటూ తన ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పకనే చెబుతూ ప్రతిపక్షానికి సీఎం జగన్ ఓపెన్ చాలెంజ్ చేశారు. ఆ సమయంలో సభా ప్రాంగణం ఒక్కసారిగా 'సీఎం, సీఎం' అంటూ హోరెత్తిపోయింది. 'ఏదైనా గ్రామంలో వచ్చిన మార్పును కాదనగలరా?' అని ప్రతిపక్షానికి జగన్ సవాల్ విసిరినప్పుడు జనం ఒక్కసారిగా సంఘీభావంగా పైకి లేచి, చేతులు ఎత్తి 'జై జగన్' అంటూ పెద్ద పెట్టున నినదించారు. తన ప్రసంగంలో సీఎం జగన్.. ఈ నాలుగున్నరేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని గణాంకాలతో వివరించారు.

సీఎంకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్, సభావేదిక వద్ద జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రులు పినిపే విశ్వరూప్, దాడిశెట్టి రాజా, తానేటి వనిత, బూడి ముత్యాలనాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, వంగా గీత, మార్గాని భరత్ రామ్, చింతా అనురాధ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, అనంత ఉదయ భాస్కర్, బొమ్మి ఇజ్రాయిల్, కర్రి పద్మశ్రీ, తలశిల రఘురామ్, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, రాష్ట్ర సివిల్ సప్లైస్, హౌసింగ్ కార్పొరేషన్ల చైర్మన్లు ద్వారంపూడి భాస్కరరెడ్డి, దవులూరి దొరబాబు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాపాక వరప్రసాదరావు, నాగులపల్లి ధనలక్ష్మి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఎస్పీ సతీష్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తదితరులు సీఎంకు స్వాగతం పలికారు.



కాకినాడ వీధుల్లో జనప్రవాహం

కాకినాడకు సీఎం వరం



కాకినాడలో అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం జగన్‌తో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు


- రూ.47 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు మంజూరు
- ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తికి స్పందించిన జగన్

కాకినాడ: జిల్లా కేంద్రమైన కాకినాడలోని జగన్నాథపురం ప్రాంతానికి రూ.47 కోట్ల ఖర్చు కాగల మంచినీటి ప్రాజెక్టు మంజూరు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచుతూ కాకినాడలో బుధవారం నిర్వహించిన సభా వేదిక నుంచి ఆయన ఈ హామీ ఇచ్చారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన సీఎం ఈ మంచినీటి ప్రాజెక్టుకు రూ.47 కోట్లు విడుదల చేస్తున్నామని ప్రకటించారు. సభలో తొలుత ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో దాదాపు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పారు. కాకినాడలో 96 వేల కుటుంబాలుంటే 84 వేల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. నగరంలోని దాదాపు అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్ వంటి అన్ని మౌలిక సదుపాయాలూ కల్పించామని చెప్పారు. జగన్నాథపురం ప్రాంతంలోని 14 డివిజన్లకు సంబంధించి రూ.47 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు మంజూరు చేస్తే అక్కడి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అరట్లకట్ట నుంచి జగన్నాథపురం వరకూ కొత్త పైపులైన్ల ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. వెంటనే స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.47 కోట్లు విడుదల చేస్తున్నట్టు సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

కాకినాడ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. అలాగే రూ.9.5 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ స్కేటింగ్ రింక్, రూ.65 కోట్లతో నిర్మించిన ముత్తా గోపాలకృష్ణ వారధి (కొండయ్యపాలెం ఫ్లై ఓవర్), రూ.15 కోట్లతో జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన క్యాథ్‌లాబ్, ట్రామా కేర్ సెంటర్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.

అర్హతే ప్రాతిపదిక : కలెక్టర్



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్నవారందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రాతిపదికగా పింఛన్లు అందిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సభలో ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లాలో 2,87,321 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యుడు ఉదయించక ముందే లబ్దిదారుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి పింఛన్ అందిస్తున్నారని చెప్పారు.


ఆత్మీయ అభివందనం: ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం జగన్


జై కొడుతూ: మళ్లీ జగన్ మామే రావాలంటున్న విద్యార్థినులు


జ్ఞాపకం.. పదిలం: ఫొటో తీసుకుంటున్న మహిళ


పూల వర్షం: అభిమాన నేత జగన్‌కు స్వాగతం పలికేందుకు పూలతో అతివలు

కానుక తోడుగా.. ఆత్మీయత నిండుగా..

- పింఛన్ల సొమ్ము పెంపుతో నీరాజనాలు
- సీఎం పర్యటనతో పింఛనుదారుల్లో ఆనందోత్సాహాలు
- జన కెరటంలా కాకినాడ

'సంక్షేమ దివ్వెలు' వెలిగించిన సీఎం జగన్‌ను చూసి ఆత్మీయత కట్టలు తెచ్చుకుంది.. ప్రతి ఇంటి తలుపూ తట్టిన 'నవరత్న పథకాల' సృష్టికర్తను ప్రతి ఒక్క గుండె అక్కున చేర్చుకుంది.. అడుగడుగునా నీరాజనాలు, అభినందన జల్లులు కురిపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన పెద్ద కొడుకు రాకను తలపించగా, కాకినాడ ఓ ఇల్లులా మారి ఆత్మీయతను పంచింది. జైజై జగన్... నినాదాలు హోరెత్తగా, కల్మషం లేని నవ్వులు, నేనున్నాననే భరోసా.. తనదైన శైలిలో సీఎం ప్రసంగం అందరినీ కట్టిపడేసింది. ఎన్నికల హామీల్లో భాగంగా వైఎస్సార్ పింఛను కానుక సొమ్మును రూ.3 వేలకు పెంచి అందజేసిన జగనన్నను వారు మనసారా ఆశీర్వదించారు. సీఎం పర్యటనతో కాకినాడ జన కెరటంలా మారింది. పింఛను లబ్ధిదారులు, అభిమానులు, పార్టీ శ్రేణులు తమ నేతను చూసేందుకు స్వచ్ఛందంగా తరలివచ్చి మురిసిపోయారు. ఈ కార్యక్రమం ఆద్యంతం పండగ వాతావరణాన్ని తలపించింది.


జేజేలు: సీఎం జగన్‌కు జేజేలు పలుకుతున్న మహిళలు


మీ రాక కోసం: సీఎం జగన్‌ను చూసేందుకు..


175 స్థానాలూ మనవే: ప్లకార్డు చూపుతున్న అభిమాని


అపురూప స్వాగతం: అడుగడుగునా పూలతో సీఎం బస్సుకు ఆహ్వానం


నాన్నా నీ స్ఫూర్తితో: దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నమస్కరిస్తున్న సీఎం జగన్, ఎంపీ బోస్, మంత్రి వేణు, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


ఆత్మీయ జ్ఞాపిక: సీఎం జగన్‌కు జ్ఞాపికను అందిస్తున్న కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లా, మంత్రి వేణు, ఎంపీలు గీత, అనురాధ



ఇదే మా కానుక: సీఎం జగన్‌కు జ్ఞాపికను ఇస్తున్న కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు



అపు'రూపం': సీఎం జగన్‌కు క్యారికేచర్‌ను అందిస్తున్న ఎంపీ గీత, మంత్రి వేణు, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు


పూల వాన: సీఎం బస్సుపై పువ్వులు జల్లుతూ.. నవ్వులు రువ్వుతూ..

సీఎం సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరికలు

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరం, చెల్లూరు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. కాకినాడ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వారంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో కేశవరం సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు అబ్బిరెడ్డి సత్యం, మండపేట తాలూకా కాపు సంఘం అధ్యక్షుడు పెదపాటి ఉమామహేశ్వరరావు, మండపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కూసులింగ దొరాజీ ఉన్నారు. అలాగే రాయవరం మండలం చెల్లూరుకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలిక శ్రీను టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న తీరుకు ఆకర్షితులై తాము వైఎస్సార్ సీపీలో చేరినట్టు ప్రకటించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో మరింత తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ తెలిపారు.


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన ప్రజాప్రతినిధులు

నేటి నుంచి చతుర్వేద మహాయాగం

రాజానగరం: ప్రపంచ శాంతి, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఐదు రోజుల పాటు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో చేపట్టే చతుర్వేద మహాయాగం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఐదో రోజైన సోమవారం పూర్ణాహుతితో ఈ యాగం సంపూర్ణం అవుతుందని నిర్వాహకుడు, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తెలిపారు. చతుర్వేదాల్లో ఉన్న విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అందించాలనేదే ఈ యాగం సంకల్పమన్నారు. యాగశాల ప్రాంగణంలో గోశాలతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నమూనాలు, ఉత్సవ విగ్రహాలతో ఆయా దేవస్థానాలకు చెందిన అర్చకుల ఆశీర్వచనంతో ప్రసాదాల పంపిణీ జరుగుతుందన్నారు.

తెలుగు మహాసభలకు ఏర్పాట్లు

చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు గైట్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని చైతన్యరాజు తెలిపారు. చతుర్వేద మహాయాగం, అంతర్జాతీయ తెలుగు మహాసభలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శ్రీరాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలకు నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభలకు మూడు వేదికలు సిద్ధం చేశామన్నారు. ఐదు రాష్ట్రాల నుంచి గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయమూర్తులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతారన్నారు.


గైట్ కళాశాల ప్రాంగణంలో ముస్తాబవుతున్న శ్రీవారి వైభవోత్సవ వేదిక

థామస్‌కు రెండు నంది అవార్డులు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుంటూరులో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన మేకప్‌మెన్ కాతేటి నూకరాజు (థామస్) రెండు నంది అవార్డులను గెలుచుకున్నారు. గుంటూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ వారం రోజుల పాటు నిర్వహించిన 22వ నంది నాటకోత్సవాల్లో సాంఘిక నాటిక విభాగంలో మేకప్ (ఆహార్యం), రంగాలంకరణ విభాగాల్లో నంది అవార్డులు అందుకున్నట్లు కాతేటి నూకరాజు (థామస్) తెలిపారు. విశాఖపట్నం తెలుగు కళాసమితి ప్రదర్శించిన 'నిశ్శబ్దమా.. నీ ఖరీదు ఎంత?' సాంఘిక నాటికలో పాత్రధారులకు ఆహార్యానికి (మేకప్), కొలకులూరు (గుంటూరు) శ్రీసాయి ఆర్ట్స్ ప్రదర్శించిన 'గమ్యస్థానాల వైపు' నాటికకు రంగాలంకరణకు రెండు నందులను అందుకున్నారు. ఈ అవార్డులను రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి చేతుల మీదుగా అందుకున్నట్లు థామస్ వివరించారు. ఒకేసారి రెండు అవార్డులు లభించడం గొప్ప విషయమని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అభినందించారు. అంబేడ్కర్ కళా మందిర్ కమిటీ సభ్యులు, ఆర్‌సీఎం చర్చి కమిటీ సభ్యులు తదితరులు ప్రశంసలు తెలిపారు.


పోసాని కృష్ణమురళి చేతుల మీదుగా నంది అవార్డు అందుకుంటున్న థామస్

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఉప్పలగుప్తం: ప్రేమ విఫలం అయ్యిందని, మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెదగాడవిల్లి పంచాయతీ పరిధి జాంబవాణి పేటకు చెందిన అనిల్‌కుమార్ (22) కాకినాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సొంతూరులో తన తల్లిదండ్రుల దగ్గరకు వచ్చాడు. నాలుగు రోజుల నుంచి ఆందోళనగా ఉన్నాడు. బుధవారం ఉదయం ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డుకు ఉరి వేసుకుని బలవన్మరణం పొందాడు. తాను ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో పెళ్లి కుదరడంతో అనిల్‌కుమార్ మనస్తాపం మృతి చెందినట్లు చెబుతున్నారు. మృతుడి తండ్రి మంద సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.వెంకటేశ్వరావు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తుని: గొల్లప్రోలు రైల్వే స్టేషన్ వద్ద ఓ మహిళ (45)ను రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు పట్టణ రైల్వే స్టేషన్ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. గతేడాది డిసెంబర్ 31న గొల్లప్రోలు రైల్వే స్టేషన్లో ఒక మహిళను రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలైంది. రైల్వే సిబ్బంది గమనించి ఆమెను 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతురాలి వివరాలు తెలియరాలేదన్నారు. పసుపు రంగుపై పచ్చ అడ్డగీతల పంజాబీ డ్రెస్ ధరించి ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది. తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ఠ వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ. 6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్ వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరయు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్‌లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, కాకినాడ జిల్లా, కాకినాడ